

శాస్త్రోక్తంగా ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైలంలో భ్రామరీ సమేత మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులకు శనివారం శాస్త్రోక్తంగా పల్లకీ సేవ, ఊయల సేవ నిర్వహించారు.



.. పటాలంలో ప్రక్షాళన

ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో ప్రక్షాళన దిశగా బదిలీలకు కమాండెంట్ దీపిక పాటిల్ శ్రీకారం చుట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని స్థానచలనం చేశారు. 8లో▸



.. శాఖలకు 'ఫోరెన్సిక్' వారధి

పోలీస్, న్యాయ శాఖలకు ఫోరెన్సిక్ విభాగం వారధి వంటిదని డీఎంఈ డాక్టర్ నరసింహులు అన్నారు. కర్నూలులో రాష్ట్రస్థాయి ఫోరెన్సిక్ వైద్యుల సదస్సు ప్రారంభమైంది. 8లో▸

బాలికలదే పైచేయి!

- ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు
- ఫస్టియర్‌లో 60 శాతం, సెకండియర్‌లో 79 శాతం ఉత్తీర్ణత
- ఈ నెల 13 నుంచి 22 వరకు రీ–కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తులు
- వచ్చే నెల 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు



ఆత్మకూరు కేజీబీవీలో విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్యామల, తదితరులు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల్లో జిల్లా బాలికలు సత్తా చాటారు. శనివారం రాష్ట్ర విద్యాశాఖ ఆన్‌లైన్‌లో ఫలితాలను విడుదల చేసింది. గత ప్రభుత్వం జూనియర్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, మన బడి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ కాలేజీల్లో ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల ఏర్పాటు చేయడంతో అధ్యాపకులకు బోధన, విద్యార్థుల అభ్యసనకు సులువు కావడంతో 2024–25 విద్యా సంవత్సరంలో ఫలితాలు కొంత మెరుగయ్యాయి. ఈ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే అత్యధిక శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం పరీక్షకు 6,368 మంది బాలురు హాజరు కాగా 3,275 మంది (51 శాతం) ఉత్తీర్ణ సాధించారు. బాలికలు 7,460 మంది హాజరు కాగా 5,012 మంది (67 శాతం) ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో 4,770 మంది బాలురు పరీక్ష రాయగా 4,370 మంది (73 శాతం) పాస్ అయ్యారు. 5,895 మంది బాలికలు పరీక్ష రాయగా, 4904 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు జనరల్ విభాగంలో 13,828 మంది విద్యార్థులు హాజరు కాగా 8,288 మంది విద్యార్థులు (60) శాతం ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 566 విద్యార్థులకు గాను 378 మంది 66.7 శాతం ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ విద్యార్థులు జనరల్ విభాగంలో 10,665 మందికి గాను 8374 (79) శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 362 మందికి గాను 329 (98.88) శాతం ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది మొదటి సంవత్సరంలో 56 శాతం, ద్వితీయ సంవత్సరంలో 66 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది మొదటి సంవత్సరం ఫలితాల్లో 60 శాతం, రెండో సంవత్సరం ఫలితాల్లో 79 శాతం ఉత్తీర్ణత సాధించారని డీవీఈఓ సునీత తెలిపారు.

జిల్లాలో ఫలితాలు ఇలా..

	సంవత్సరం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణత సాధించిన వారు	శాతం
జనరల్ విభాగం	మొదటి సంవత్సరం	13,828	8,288	60
	రెండో సంవత్సరం	10,665	8,374	70
ఒకేషనల్ విభాగం	మొదటి సంవత్సరం	1,293	802	62
	రెండో సంవత్సరం	936	704	75

ప్రభుత్వ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన వారు..

మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను సీమ 429 (గోస్పాడు), ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను వైష్ణవి 461 (ఆళ్లగడ్డ), సీఈసీలో అఫ్రీమ్ 447 (బనగానపల్లె), హెచ్ఈసీలో సైనాపర్వీన్ 480 (బనగానపల్లె), ఎస్సీఎంఎల్ గ్రూప్‌లో తహసీన్ 397 (నంద్యాల ఉర్దూ జూనియర్ కళాశాల) మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వెన్నల 976 (ఆళ్లగడ్డ), బైపీసీలో దేవరాజ్ 968 (నంద్యాల), సీఈసీలో సుచిత్ర 911(అవుకు), హెచ్ఈసీలో ఫర్హానా 914 (ఆత్మకూరు) మార్కులు సాధించారు.

ఏపీ మోడల్ స్కూళ్లలో..

జిల్లాలో 19 ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. మొదటి సంవత్సరం ఫలితాల్లో 1,474 మందికి గాను 987 మంది (53.91 శాతం), ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 946 మందికి గాను 814 మంది (82 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో పాణ్యం మోడల్ స్కూల్ విద్యార్థులు 100 శాతం సాధించగా, అతి తక్కువగా కొలిమిగుండ్ల మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల 59 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

మూడు కేజీబీవీల్లో వంద శాతం..

జిల్లాలో 27 కేజీబీవీల్లో ఉండగా మొదటి సంవత్సరంలో 722 మంది విద్యార్థులకు గాను 401 మంది (55.5 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 389 మందికి గాను, 304 మంది (78 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఆత్మకూరు, గోస్పాడు, శిరివెళ్ల కేజీబీవీ పాఠశాల్లో మొదటి సంవత్సరం ఫలితాల్లో 100 శాతం ఫలితాలు సాధించగా, పాములపాడు కేజీబీవీ కళాశాలలో అతి తక్కువగా 25 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో..

జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మొత్తం మొదటి సంవత్సరంలో 2,441 మందికి గాను 1,161 (47 శాతం) మంది, ద్వితీయ సంవత్సరంలో 1,518 మందికి గాను 1,143 (75 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. గోస్పాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 89 శాతం, అతి తక్కువ సంజామల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 13 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

రీకౌంటింగ్‌కు అవకాశం...

పరీక్ష ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చిన వారు, వచ్చిన మార్కులపై అనుమానమున్న వారికి రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించారు. రీకౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ.260, రీ వెరిఫికేషన్‌తో పాటు, స్కాన్ చేసిన సమాధాన పత్రానికి ఒక్కో సబ్జెక్టుకు రూ.1,300 చెల్లించాలి. ఇందుకు ఈ నెల 13వ నుంచి 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. సప్లిమెంటరీ పరీక్షకు ఈ నెల 15 నుంచి 22 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి. ఈ పరీక్షలు మే నెల 12 నుంచి 17వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి వచ్చే నెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

రెసిడెన్షియల్ కళాశాలల్లో ఇలా..

జిల్లాలో ఆరు సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో మొదటి సంవత్సరానికి 394 మందికి గాను 360 మంది (90 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 348కి గాను 338 మంది (97 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో నెరవాడ బీసీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో 100 శాతం కాగా, డోన్ బాలికల కళాశాల 68 శాతంతో చివరలో నిలిచింది.

- ఒకేషనల్‌కు సంబంధించి 9 ప్రభుత్వ కళాశాలల్లో 566 మందికి గాను 378 పాస్ కాగా(66.78శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే రెండో సంవత్సరం 362 మంది గాను 329 మంది పాసై (90.8శాతం) ఉత్తీర్ణులయ్యారు.
- జిల్లాలో మూడు బీసీ వెల్ఫేర్ కళాశాలలో మొదటి సంవత్సరం 244 మందికి గాను 229 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం 166 మందికి గాను 158 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం అత్యధికంగా నెరవాడ ఎంజేపీఏ పీబీ సీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల 98.56 శాతం కాగా, అతి తక్కువగా సున్నిపెంట బాలికల కాలేజీలో 69.62 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ మూడు కళాశాలల్లో మొదటి సంవత్సరం 300 మందికి గాను 269 మంది (89.6శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే రెండో సంవత్సరం 209 మందికి గాను 204 మంది పాస్ (97.60 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం అత్యధికంగా శ్రీశైలం ఏపీటీడబ్ల్యూఆర్ కళాశాల వంద శాతం, అతి తక్కువలో శ్రీశైలం సున్నిపెంట కళాశాల 92 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఇంజనీర్ కావాలని ఉంది



ఎంపీసీ గ్రూపులో 976 మార్కులు వచ్చాయి. మా తల్లిదండ్రులు కష్టపడి పడి చదివించారు. బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్లి వారి ఆశయాన్ని నెరవేరుస్తా. నేను భవిష్యత్తులో ఇంజనీర్ కావాలని ఉంది.
– వెన్నెల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆళ్లగడ్డ

డాక్టర్‌గా పేదలకు సేవలు అందిస్తా



నీట్‌లో ప్రతిభ చాటి ఎంబీబీఎస్ సీటు సాధిస్తా. డాక్టర్ వృత్తి చేపట్టాలని ఉంది. పేదలకు ఉచితంగా సేవ చేస్తా. ఇంటర్‌లో 968 మార్కులు సాధించేందుకు కళాశాల అధ్యాపకులు కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది.
– దేవరాజ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నంద్యాల

చాలా సంతోషంగా ఉంది



మాది శ్రీపతిరావుపేట గ్రామం. నేను ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీసీ చదువుతూ 470 మార్కులకు గానూ 462 మార్కులు సాధించాను. మా నాన్న ఓ ప్రయివేట్ కళాశాలలో పని చేస్తున్నారు. నన్ను ఇంజినీర్‌గా చూడాలన్నదే మా నాన్న లక్ష్యం. కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సెకండియర్‌లో కూడా మంచి మార్కులు తెచ్చుకుంటా.
– ఆవుల వెంకటగౌరి, ఆత్మకూరు

డ్రైవర్ ఇంట చదువుల తల్లి



పగిడ్యాల: మండల కేంద్రంలోని దేవనగర్ కాలనీకి చెందిన పగడం మద్దిలేటి, సుజాతలు పెద్దగా చదువుకోలేదు. వీరికి నవ్యశ్రీ, జగన్ ఇద్దరు సంతానం. మద్దిలేటి ఆల్విన్ వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. చిన్నప్పటి నుంచి నవ్యశ్రీ చదువు పట్ల ఆసక్తి కనబరుస్తూ వచ్చింది. లక్ష్మాపురం అంచె వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ ఉత్తమ మార్కులు సాధించింది. బైపీసీ గ్రూప్‌లో 982 మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుమార్తెను డాక్టర్ చేయాలనే లక్ష్యంతో కర్నూలులో ఎంసెట్ కోచింగ్ ఇప్పిస్తున్నట్లు తెలిపారు.

చిరు వ్యాపారి కుమార్తె ప్రతిభ



జీఎస్ సబియా

ఆత్మకూరు: పట్టణంలోని కేజీ రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట గోనె సంచుల వ్యాపారం చేసే జిలానీ కుమార్తె సబియా ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ చాటింది. స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో బైపీసీ చదువుతోంది. శనివారం విడుదలైన ఫలితాల్లో 440 మార్కులకుగానూ 433 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా జిలానీ మాట్లాడుతూ.. 'నా కుమార్తె బాగా చదువుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. రెండో సంవత్సరం కూడా మంచి మార్కులు సాధించి స్టేట్ ర్యాంకు పొందాలని ఆశిస్తున్నాను. సబియా డాక్టర్‌గా స్థిరపడాలన్నదే కోరిక' అన్నారు.

కస్తూర్బాలో మెరిసిన హసీనా



డోన్ టౌన్: ఇంటర్ ఫలితాల్లో డోన్ కస్తూర్బా విద్యార్థిని డి.హసీనా ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో 455 మార్కులు సాధించింది. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన హసీనా పట్టుదలతో చదివి జిల్లాలో ఉన్న 27 కేజీబీవీ ఎంపీసీ విభాగంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా నిలిచింది.

న్యూస్‌రీల్

పీఏసీ సభ్యులుగా బుగ్గన, హఫీజ్‌ఖాన్




కర్నూలు(టౌన్): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా(పీఏసీ) మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి (డోన్), మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్(కర్నూలు) నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 మందికి చోటు లభించగా.. కమిటీలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి వీరిరువురికీ అవకాశం దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

మద్యపాన వ్యసన విముక్తి కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు

నందికొట్కూరు: పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట మద్యపాన వ్యసన విముక్తి కేంద్రాన్ని శనివారం నంద్యాల అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యపానం, నాటుసారా, మత్తు కలిగించే పదార్థాలను సేవించడం వలన కలిగే నష్టాలను గురించి తెలుసుకోవాలన్నారు. వ్యసనాలను విముక్తి కలిగించేందుకే ఈ కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. మద్యం మత్తుకు బానిసైతే సామాజికంగా, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ రాజశేఖర్, ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్, ఎస్ఐలు జప్రూల్లా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భ్రామరీకి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా జరిపించారు. శ్రీశైలానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో లక్ష కుంకుమార్చనలో భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశం దేవస్థానం కల్పించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పరోక్షసేవలో పాల్గొన్నారు. మంగళకరమైన ద్రవ్యాలలో కుంకుమకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కుంకుమ ద్రవ్యంతో అమ్మవారిని అర్చించడం విశేష ఫలదాయకమని పండితులు వివరించారు. లక్ష కుంకుమార్చన సేవను జరిపించుకోవడం వలన కష్టాలు తొలగిపోతాయని, సర్వశుభాలు కలుగుతాయని, అభీష్టాలు సిద్ధిస్తాయని, సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయన్నారు.

రేపటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు


నంద్యాల: ఈ నెల 14 తేదీ రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రభుత్వ సెలవు కావడంతో కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నిర్వహించడం లేదన్నారు.

నేడు 'గురుకుల' ప్రవేశ పరీక్ష

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (2025–26) 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 13న (నేడు) పరీక్ష నిర్వహిస్తున్నట్లు గురుకులాల సమన్వయ కర్త డాక్టర్ ఐ.శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలోని 8, నంద్యాల జిల్లాలోని 6 పరీక్షా కేంద్రాల్లో 5వ తరగతిలో 1,120 సీట్లకు 9340 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 1,480 సీట్లకు 7,727 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు.

గజ వాహనంపై రంగనాథుడు

- నేడు రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో రంగనాథుడు



గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుడు స్వామి వారు శనివారం గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి మూల, ఉత్సవ విగ్రహాలకు అర్చకులు పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన వంటి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం చెక్కబొమ్మ రూపంలో ఉన్న స్వామివారి ఉత్సవ మూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం గజవాహనంతో అలంకరించిన గ్రామోత్సవ వాహనంపైకి చేర్చి పూజలు నిర్వహించారు. ఆతర్వాత భక్తులు గోవింద నామాన్ని స్మరిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. పూజల్లో ఆలయ ఈఓ సాయికుమార్, చైర్మన్ నారాయణరెడ్డి, ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంతో పేరొందిన తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి రథోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.

భజేహం.. వాయుపుత్రం

హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం జిల్లాలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కర్నూలులో 'జై హనుమాన్..జై శ్రీరామ్' నినాదాలతో విజయ శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ఆశేష భక్తజనం మధ్య సి.బెళగల్‌లో మహా రథోత్సవాన్ని జరిపారు. గూడూరు పట్టణంలో ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదోని పట్టణ శివారులోని రణమండలకొండలో వాయుపుత్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హొళగుందలో శోభాయాత్ర నిర్వహించి బాలాంజనేయస్వామికి నైవేద్యాలు సమర్పించారు.



కర్నూలులో ఆంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న అర్చకులు

లడ్డూ మాటున దోపిడీ



లడ్డూలను ప్యాక్‌గా చేసి విక్రయనానికి సిద్ధంగా ఉంచిన దృశ్యం

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో స్వామివారి ప్రసాదంగా భక్తులు అందించే లడ్డూలో విక్రయదారుడు చేతివాటం ప్రదర్శిస్తున్నాడు. ఈనెల ఒకటోవ తేదీన ఫెస్టివల్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి సమక్షంలో టెంకాయలు, లడ్డూలు, కొబ్బరి చిప్పల వేలాలు నిర్వహించారు. ఈ వేలాల్లో కొణిదేల గ్రామానికి చెందిన రంగస్వామి రూ.1,05,000లకు స్వామివారి ప్రసాదంగా లడ్డూల విక్రయాన్ని దక్కించుకున్నారు. 70గ్రాముల బరువుతో నాణ్యతగా ఉండే ఒక లడ్డూ రూ.15ల చొప్పున విక్రయించాలని, అధిక ధరలకు లడ్డూ విక్రయించినా, నాణ్యతలేకపోయినా వేలం పాటను రద్దుచేస్తామని అధికారులు హెచ్చరించారు. వేలం పాటదారుడు మూడు లడ్డూలను ప్యాక్‌గా చేసి రూ.50 చొప్పున విక్రయిస్తూ అప్పనంగా రూ.5 భక్తుల నుంచి నొక్కేస్తున్నారు. తక్కువ బరువు, నాణ్యత లేని లడ్డూలను విక్రయిస్తున్నాడని, అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

నేడు కేపీహెచ్ఓఎస్ఏ నూతన కార్యవర్గ ఎన్నికలు

కర్నూలు(అగ్రికల్చర్): అనిమల్ హజ్బెండరీ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ (కేఏహెచ్‌ఓఎస్ఏ) నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలో జరుగనున్నాయి. ఈ అసోసియేషన్‌లో పశుసంవర్థక శాఖకు చెందిన అసిస్టెంటు డైరెక్టర్ నుంచి డీడీ, జేడీ స్థాయి అధికారులు ఉంటారు. ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర నాయకత్వం ఎన్నికల అధికారిగా డాక్టర్ కె.సత్యనారాయణను నియమించింది. ఎన్నికల ప్రక్రియ మొత్తం ఒకే రోజు పూర్తి కానుంది.



బావి లోపలి భాగంలో పూడిక తీస్తున్న దృశ్యం

ఎర్ర రాళ్ల బావికి పూర్వ వైభవం

- క్రీ.శ 1242లో నిర్మించినట్లు ఆధారాలు
- గ్రామ పెద్దల చొరవతో పూడికతీత
- నేటికీ చెక్కు చెదరని నిర్మాణం
- నలువైపుల నుంచి బావిలోకి నీరు

రాజులు పోయారు.. రాజ్యాలు పోయాయి. వారి పాలనకు గుర్తుగా చారిత్రక కట్టడాలు, బావులు మాత్రం నేటికి దర్శనమిస్తున్నాయి. చారిత్రక వైభవానికి మెట్ల బావులు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. నందిపాడు గ్రామ శివార్లలోని చౌడేశ్వరిదేవి ఆలయ ఆవరణలో క్రీ.శ 1242లో మెట్ల బావి నిర్మించినట్లు ఇక్కడ లభ్యమైన శిలా శాసనం ద్వారా తెలుస్తోంది. దశాబ్దాలుగా బావి పూడిపోవడంతో గ్రామ పెద్దలు పూడికతీయాలని నిర్ణయించారు. వీరికి వివిధ ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్న యువకులు చేయూత అందించారు. గోవిందపల్లెకు చెందిన కార్మికుల సాయంతో పది రోజుల నుంచి చేపడుతున్న పూడికతీత పనులు ముగిశాయి. ఎర్రటి రాళ్లతో నిర్మించిన మెట్ల బావి కళ్లు చెదిరేలా కనిపిస్తోంది. 783 ఏళ్లు గడిచినా ఒక్క రాయి కూడా చెదిరిపోకుండా ఇప్పటికీ అలాగే ఉంది. 35 అడుగుల మేర బావి లోతు ఉంది. లోపలి భాగంలోని నాలుగు వైపుల గోడల నుంచి నీళ్లు బావిలోకి చేరుతున్నాయి. ఓ వైపు ఇంజిన్ సాయంతో నీళ్లు బయటకు పంపింగ్ చేసి శుభ్రం చేస్తూ వచ్చారు.

– కొలిమిగుండ్ల



క్రేన్ సాయంతో పూడికను బయటకు తీస్తూ..



బావిలో లభ్యమైన రాతి దివ్వె



ఆలయం ఆవరణలో ఉన్న శిలాశాసనం



చౌడేశ్వరిదేవి ఆలయం

క్లుప్తంగా

గంజాయి విక్రయదారుల అరెస్టు

కర్నూలు: కర్నూలు నగరంలోని వివిధ కాలనీలకు చెందిన యువకులు గంజాయి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో మూడో పట్టణ పోలీసులు నిఘా వేసి 9 మందిని అరెస్టు చేశారు. ఆదోనికి చెందిన సయ్యద్ హబీబ్ బాషా, కర్నూలు మండలం తాండ్రపాడుకు చెందిన షేక్ ఫిరోజ్ బాషా, బుధవారపేటకు చెందిన గాజుల జానకిరాముడు, శ్రీరాం నగర్‌కు చెందిన లోకేష్ కుమార్, అతని సోదరుడు అనిల్ కుమార్, అదే కాలనీకి చెందిన కుమ్మరి నవీన్ కుమార్, గణేష్ నగర్‌కు చెందిన షేక్ ఖాజా రహిమాన్, బీ క్యాంప్‌కు చెందిన చందమాల శివవంశీ, అరోరా నగర్‌కు చెందిన చెక్కా పరుశురాముడులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు. కాగా ఆదోని పట్టణానికి చెందిన షకీబ్ హుసేన్, కోదండరాముడు పరారీలో ఉన్నారని, వీరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కొంతకాలంగా వీరు గంజాయిని పొట్లాల రూపంలో విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సందీప్ కుమార్ (ఫైల్)

ఆలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో సందీప్ కుమార్ (30) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలూరు మండలం కురువళ్లి గ్రామం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మస్కీ గ్రామానికి చెందిన లింగప్ప కుమారుడు సందీప్ కుమార్ ఫ్లిప్ కార్ట్ అనే ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం మంత్రాలయం పట్టణంలో బంధువుల గృహప్రవేశానికి వచ్చాడు. శుభకార్యానికి పూలు తీసుకోరావడానికి సాయంత్రం 8 గంటలకు మంత్రాలయం నుంచి ఆలూరు మీదుగా బళ్లారికి బయలుదేరాడు. బళ్లారి నుంచి వస్తున్న లారీ ఆలూరు మండలంలోని కురువళ్లి క్రాస్ వద్ద స్కూటర్‌ను ఎదురుగా బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో సందీప్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు సందీప్‌కు వివాహం కాలేదు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఓర్వకల్లు: కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం శకునాల గ్రామంలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని స్థానిక ఎస్సీ కాలనీలో నివాసముంటున్న శీలం చిన్నరాజు అలియాస్ ఆటో రాజు అనే వ్యక్తికి వెల్దుర్తి మండలం పుల్లగుమ్మికి చెందిన మాదక్క (మాధవి)(45)తో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. కూలీ పనులకు వెళ్తూ జీవిస్తున్నారు. కొన్నేళ్లుగా సాఫీగా సాగిన వీరి కాపురంలో మనస్పర్థలు ఏర్పడి తరచుగా గొడువలు పడేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం అందరూ ఉపాధి పనులకు వెళ్లాక.. జీవితంపై విరక్తి చెందిన మాధవి ఇంట్లోని ఉరేసుకుంది. గమనించిన భర్త స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సునీల్ కుమార్ తన పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకొని మాధవి మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతురాలు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టనున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ పేర్కొన్నారు.


మృతి చెందిన మాదక్క(మాధవి)

ఏపీఎస్పీ రెండో పటాలంలో ప్రక్షాళన

13 మంది ఏఆర్ఎస్ఐలు, 28 మంది హెచ్‌సీలు, 71 మంది పీసీలు బదిలీ

- హెడ్ క్వార్టర్‌లో పాతుకుపోయిన ఫెవికాల్ వీరులందరికీ స్థానచలనం
- ఆరోగ్య సమస్యలున్న వారికి ప్రాధాన్యత
- నెల రోజుల పాటు కసరత్తు చేసి బదిలీల జాబితా విడుదల



ఏపీఎస్పీ రెండవ పటాలం పరిపాలన విభాగం కార్యాలయం

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో ప్రక్షాళన దిశగా బదిలీలకు నూతన కమాండెంట్ దీపిక పాటిల్ శ్రీకారం చుట్టారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన, ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురిపై బదిలీ వేటు వేశారు. ప్రత్యేక పోలీసు విభాగం చీఫ్ కార్యాలయ ఉత్తర్వుల మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ హోదాల్లోని 112 మంది సిబ్బందికి స్థానచలనం కల్పిస్తూ శుక్రవారం రాత్రి కమాండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 13 మంది ఏఆర్ఎస్ఐలు, 28 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 71 మంది పోలీసు సిబ్బందిని వారున్న చోటు నుంచి బదిలీ చేశారు. వెంటనే విధుల్లో చేరిపోవాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నెల రోజుల పాటు బదిలీల జాబితాపై ఆయా కంపెనీల ఆర్ఐలు కసరత్తు చేసి జాబితాను రూపొందించగా, దాని ఆధారంగా జూమ్ మీటింగ్ నిర్వహించి బయటి కంపెనీల్లో పనిచేస్తున్న వారితో కూడా కమాండెంట్ మాట్లాడి బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు.

టర్న్ ప్రకారం హెడ్ క్వార్టర్‌కు నియామకం

బదిలీల వ్యవహారంలో గతంలో ధన ప్రవాహం కీలకంగా పనిచేసేది. పటాలంలో పనిచేసే సిబ్బందికి టర్న్ ప్రకారం హెడ్ క్వాటర్ విధులకు అవకాశం కల్పించాలి. పటాలంలో హెడ్ క్వార్టర్‌తో కలిపి మొత్తం 9 కంపెనీలు ఉన్నాయి. ఏళ్ల తరబడి కుటుంబాలకు దూరంగా బయటి కంపెనీల్లో పనిచేసినవారికి ఈ బదిలీల్లో హెడ్ క్వార్టర్ విధులు నిర్వహించే అవకాశం దక్కిందని సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్య సమస్యలున్న వారికి ప్రాధాన్యత

ప్రతి ఒక్కరినీ ఏడాదికొకసారి ఉన్న కంపెనీ నుంచి మరో కంపెనీకి బదిలీ చేయాలనే నిబంధన ఉంది. ఏళ్ల తరబడి బయటి కంపెనీల్లో పనిచేసినవారికి ఈ బదిలీల్లో న్యాయం జరిగిందని సిబ్బందిలో చర్చ జరుగుతోంది. అయితే అనారోగ్య కారణాలు సాకుగా చూపి హెడ్ క్వార్టర్‌లోనే కొనసాగాలని ఎక్కువమంది సిబ్బంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించి వైద్యుల చేత కమాండెంట్ వారికి వైద్యపరీక్షలు జరిపించారు. అనారోగ్య కారణాలతో వాస్తవంగా బాధ పడుతున్నట్లు డాక్టర్లు ఇచ్చిన నివేదిక ఆధారంగా అలాంటి వారికి ప్రాధాన్యతనిచ్చి హెడ్ క్వార్టర్‌లో కొనసాగేలా చర్యలు చేపట్టారు. అలాగే పదవీ విరమణకు దగ్గరగా ఉన్న వారిని కూడా కోరుకున్న స్థానాల్లో నియమించారు.

ఫెవికాల్ వీరులపై ప్రత్యేక విచారణ జరిపించి స్థానచలనం

- హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి రెడ్డి స్టోర్ ఎన్‌సీఓగా కొన్నేళ్ల పాటు హెడ్ క్వార్టర్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అతడిని ఆ స్థానం నుంచి తప్పించి బయటి కంపెనీకి బదిలీ చేశారు.
- నరసింహారెడ్డి కళ్యాణ మండపం నిర్వహణ పేరుతో ఇరవై ఏళ్లుగా హెడ్ క్వార్టర్‌లోనే కొనసాగుతున్నారు.
- తిరుమల్ రెడ్డి ట్రైనింగ్ గ్రూప్‌లో, బందె నవాజ్, మౌలాలి బెటాలియన్ హాస్పిటల్ విధులు నిర్వహిస్తూ కొన్నేళ్లుగా హెడ్ క్వార్టర్‌లోనే ఉంటున్నారు.
- జిలానీ బాషా టైలరింగ్ గ్రూపులో ఉంటూ హెడ్ క్వాటర్‌లోనే కొన్నేళ్లుగా కొనసాగుతున్నాడు. వీరితో పాటు మరో పది మంది దాకా వివిధ గ్రూపుల్లో హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తించి వారందరికి స్థానచలనం కల్పించారు.
- అసిస్టెంట్ కమాండెంట్ దగ్గర ఏళ్ల తరబడి హెడ్ క్వార్టర్‌లోనే కొనసాగుతున్న వారికి కూడా స్థానచలనం కల్పించి బయటి కంపెనీలకు బదిలీ చేశారు.
- కానిస్టేబుళ్లు కిరణ్, విశ్వనాథరెడ్డి, హుసేనయ్య, రియాజ్, రాజు తదితరులు డీఏస్పీల దగ్గర కొన్నేళ్లుగా సీట్లకు అతుక్కుని విధులు నిర్వహించేవారు. వారందరినీ ఈ బదిలీల్లో బయటి కంపెనీలకు సాగనంపారు.
- విశ్వనాథరెడ్డి కానిస్టేబుల్‌గా విధుల్లో చేరినప్పటి నుంచి హెడ్ క్వార్టర్‌లోనే కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్ల వద్ద విధులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో ఆయనపై కూడా బదిలీ వేటు పడింది. మొత్తంగా హెడ్ క్వార్టర్‌లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న 9 మందికి ఈ బదిలీల్లో స్థానచలనం కలిగింది. గతంలో హెడ్ క్వార్టర్ విధులు చేయని పది మందికి ఈ బదిలీల్లో అవకాశం దక్కింది.

గాయపడిన వ్యక్తి మృతి

మహానంది: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగవరం గ్రామానికి చెందిన గాలి శ్రీనివాసులు(62) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...నందిపల్లె మెట్ట వద్ద శుక్రవారం రాత్రి నంద్యాలకు వెళ్తున్న ఓ ఆటో ఎదురుగా బైక్‌పై వస్తున్న గోపవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న శిరివెళ్ల మండలం గంగవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. 108 ద్వారా నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మృతి చెందిన శ్రీనివాసులు కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఏపీ మోడల్ హాస్టల్‌లో నాగుపాము


పామును పట్టుకున్న మోహన్

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ హాస్టల్‌లో శనివారం రాత్రి నాగుపాము కనిపించడంతో విద్యార్థినులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. నాగుపామును చూసిన సిబ్బంది వెంటనే అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన స్నేక్‌క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించగా మోహన్ వెంటనే హాస్టల్ వద్దకు చేరుకుని నాగుపామును పట్టుకుని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలేశాడు.

వైభవంగా అక్కమహాదేవి జయంతోత్సవం


పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లికార్జున స్వామివారి పరమ భక్తులలో ఒకరైన శివశరణి అక్కమహాదేవి జయంతోత్సవం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి వారికి పంచామృత అభిషేకం, జలాభిషేకం తదితర విశేషపూజలు చేపట్టారు. పూజల్లో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు. శ్రీశైల మల్లికార్జునుడిలో ఐక్యం కావాలనే సంకల్పంతో అక్కమహాదేవి తన జీవితపు చివరి రోజులను శ్రీశైలంలోనే గడిపారని పండితులు తెలిపారు. ప్రస్తుతం అక్కమహాదేవి గుహలుగా పిలువబడుతున్న ఇక్కడి గుహలలో కొంతకాలం, కథళీవనంలో కొంతకాలం తపస్సు చేసి సిద్ధి పొందారన్నారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి వారికి ప్రతిరోజు కూడా పూజలు నిర్వహిస్తామన్నారు. అక్కమహాదేవి జయంతిని పురస్కరించుకుని సాయంత్రం భ్రామరీ కళావేదికపై అక్కమహాదేవి జీవిత విశేషాలపై డాక్టర్ ఎం.మహంతయ్య వారి ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

మద్యపాన వ్యసన విముక్తికి డీ–అడిక్షన్ సెంటర్లు

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏసీ హనుమంతరావు


మాట్లాడుతున్న ఏసీ హనుమంతరావు

కర్నూలు: మద్యపాన వ్యసనం నుంచి విముక్తి కల్పించడానికి డీ–అడిక్షన్ సెంటర్‌లో చేర్పించి ఎక్సైజ్ శాఖ అన్ని విధాలా తోడ్పాటునందిస్తుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంతరావు అన్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయ సముదాయ ప్రాంగణంలో శనివారం కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్ (కేర్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్, కేర్ కమిటీ, అనంత ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, ఆల్కహాల్ అనామలీస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మద్యపాన వ్యసనంతో దుష్పరిణామాలు, దానితో సమాజంలో ఎదురయ్యే సమస్యలు, వ్యసన విముక్తికి గల అవకాశాలను గురించి వక్తలు వివరించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంతరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి మచ్చ సుధీర్ బాబు తదితరులు హాజరయ్యారు. మద్యపాన వ్యసనంతో వ్యక్తులు, కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక ఇబ్బందులను గురించి వివరించారు. ఆల్కహాల్, అనామలిస్ స్వచ్ఛంద సంస్థకు చెందిన జనార్దన్ తమ సంస్థ తరఫున అందించే మద్దతు, అవకాశాల గురించి వివరించారు. అనంత ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టుకు చెందిన రాజేంద్రప్రసాద్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రామకృష్ణారెడ్డి, రాజశేఖర్ గౌడ్, సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అత్తపై కోడలు దాడి


ఎస్ఐ దుగ్గిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు రాజేశ్వరమ్మ

బనగానపల్లె రూరల్: ఆస్తి వివాదం నేపథ్యంలో అత్తపై కోడలు దాడి చేసిన ఘటన బనగానపల్లెలో చోటు చేసుకుంది. స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న బాధితురాలు.. నాగసుబ్రహ్మణ్యం, రాజేశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సునీల్‌కుమార్ భార్య తేజస్విని ఆస్తి విషయంలో అత్తమామలతో వివాదం నెలకొంది. ఈ క్రమంలో శనివారం ఆవేశానికి గురైన తేజస్వీని కత్తిపీటతో అత్త రాజేశ్వరమ్మపై దాడి చేసింది. గాయపడిన ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

పోలీస్, న్యాయ శాఖలకు 'ఫోరెన్సిక్' వారధి



సదస్సులో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ నరసింహులు


హాజరైన ఫోరెనిక్స్ వైద్యులు

- డీఎంఈ డాక్టర్ నరసింహులు

కర్నూలు(హాస్పిటల్): పోలీస్, న్యాయ శాఖలకు ఫోరెన్సిక్ విభాగం వారధి వంటిదని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ డీఎస్ఎల్‌వీ నరసింహులు అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల 6వ రాష్ట్ర స్థాయి ఫోరెన్సిక్ వైద్యుల సదస్సు శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంఈ డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ.. ఫోరెన్సిక్ విభాగంలో మెడికో లీగల్ డాక్యుమెంటేషన్ అధిక ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. క్లినికల్ ఫోరెన్సిక్ మెడిసిన్‌ను ఓపీ విభాగంలో చేర్చేందుకు ప్రభుత్వానికి నివేదించామని, అనుమతి లభించిన వెంటనే ఓపీ విభాగంలో కూడా సేవలందిస్తామని చెప్పారు. అధునాతన టెక్నాలజీతో కచ్చితమైన ఫలితాలను అందించవచ్చన్నారు. ఎంఎల్‌సీ కేసుల్లో ఫోరెన్సిక్ విభాగం ఇచ్చే నివేదికతో నిందులను గుర్తించవచ్చన్నారు.

- విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ.. మెడికో లీగల్ కేసుల్లో ఫోరెన్సిక్ విభాగం సేవలు మరువలేనివన్నారు. ఆ విభాగం అందించే నివేదికలతోనే నేర పరిశోధనలో వాస్తవ విషయాలు వెలుగు చూస్తున్నాయన్నారు. నేర పరిశోధనలో 'రియల్ హీరోస్' ఫోరెన్సిక్ విభాగ వైద్యులేనని అన్నారు.
- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఫోరెన్సిక్ విభాగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సాంకేతిక సదుపాయాలు కూడా ఫోరెన్సిక్ విభాగానికి తోడ్పాటునందిస్తున్నాయని చెప్పారు.
- కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకి ఫోరెన్సిక్ సబ్జక్టు ఎంతో ఇష్టమని, ఈ సబ్జక్టులో ప్రతి విషయానికి ఒక కథతో అనుసంధానించబడి ఉంటుందన్నారు.
- కార్యక్రమంలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే. ప్రకాష్, రిటైర్డ్ ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ వీరనాగిరెడ్డి, ఫోరెన్సిక్ హెచ్ఓడీ, ప్రొఫెసర్ డాక్టర్ సాయిసుధీర్, ప్రొఫెసర్ అండ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ కేసీ రంగయ్య, ఏపీఏఎఫ్ఎంటీ జనరల్ సెక్రటరీ డాక్టర్ సుబ్బారావు, ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందాలి

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందించే ఆరోగ్య సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలని, అప్పుడే ప్రభుత్వ లక్ష్యం సిద్ధించినట్లు అవుతుందని డీఎంఈ డాక్టర్ డీఎస్ఎల్‌వీ. నరసింహులు చెప్పారు. శనివారం సాయంత్రం ఆయన కర్నూలు మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లతో సమావేశమయ్యారు. కాలేజీ, హాస్పిటల్ మధ్య సమన్వయం ముఖ్యమని, రోగులకు ఇబ్బంది లేకుండా ఆయా విభాగాలు సర్దుబాటు చేసుకుని సేవలు అందించాలని కోరారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ సీఎస్‌కే. ప్రకాష్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

- వక్ఫ్ బోర్డు జేపీసీ కన్వీనర్ సయ్యద్ జాకీర్ అహ్మద్



కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వక్ఫ్ బోర్డు జేపీసీ కన్వీనర్ సయ్యద్ జాకీర్ అహ్మద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోదీ రాజ్యంలో లౌకిక వాదానికి తూట్లు పొడుస్తున్నారని, అందులో భాగంగా వక్ఫ్ భూముల ఆక్రమణకు పూనుకుంటున్నారని చెప్పా రు. శనివారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ–ఇన్సాఫ్ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయరాదని కోరుతూ ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాకీర్ అహ్మద్ మాట్లాడుతూ మోదీ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలోని ముస్లింలు, దళితులు, ఆదివాసీలు, గిరిజనులు,అణగారిన వర్గాలపై ఉక్కుపాదం మోపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్, ప్రైవేట్‌పరం చేసేందుకే సవరణలు చేశారని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిట్టనిలువునా ముంచే ప్రయత్నం జరుగుతోందని , దీనిని కాపాడాలంటే బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.జగన్నాథం మాట్లాడుతూ..విభిన్న మతాల కలయికకు ప్రతీకగా నిలిచే భారతదేశంలో మతోన్మాద రాజకీయాల కుట్ర జరుగుతోందన్నారు. అందులో భాగంగా అంబేడ్కర్ ఆశయ సాధనకు తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణకు పూనుకుందన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నాయకులు మహేష్, కుమార్, ఈశ్వర్, నాగరాజు, ఇన్సాఫ్ నాయకులు అన్వర్‌బాషా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పత్తికొండ రూరల్ : చిన్నహుల్తి గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పత్తికొండకు చెందిన డీలర్ అంజినయ్య కుమారుడు రమేష్ (42) మృతి చెందాడు. చిన్నహుల్తి గ్రామానికి చెందిన బత్తిని నౌనేపాటి బైక్‌పై వస్తున్న సమయంలో రోడ్డుకు అడ్డుగా వచ్చిన రమేష్‌ను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నౌనేపాటి తీవ్ర గాయాలపాలవడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

అటికెలగుండులో ఘర్షణ

పత్తికొండ రూరల్: అటికెలగుండు గ్రామంలో శుక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సీఐ జయన్న తెలిపిన వివరాల మేరకు గ్రామంలో రేషన్‌కార్డు దారులందరూ ఈ–కేవైసీ చేయించుకోవాలని దండోరా వేస్తుండగా గ్రామానికి చెందిన కొందరు మాకు తెలుసులే అంటూ దురుసుగా ప్రవర్తించడంతో మాటామాట పెరిగి రెండు వర్గాలకు చెందిన వారు పరస్పరం దాడి చేసుకున్నారు. ఘర్షణకు పాల్పడిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.